విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి

మియాపూర్, అక్టోబర్ 28 : విద్యుత్ షాక్‌కు గురై భవనంపై నుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... జనగాం జిల్లా తరిగోపుల అంశీపూర్‌కు చెందిన శివరాత్రి యాదగిరి (45)కు భార్య రజిత, కుమార్తె సౌమ్య, కుమారులు అజయ్, మనోజ్‌లు ఉన్నారు. నగరానికి వచ్చి గత ఏడు సంవత్సరాలుగా జగద్గిరిగుట్టలో నివాసం ఉంటూ, స్థానికంగా భవన నిర్మాణంలో సామగ్రి మోసే లిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గత మూడు నెలలుగా యాదగిరి, రజితలు తమ సొంత ఇల్లు నిర్మాణం చేయడంతో అక్కడే సొంత ఊరిలో ఉన్నారు. అక్కడ పనులు పూర్తి కావడంతో మూడు రోజుల క్రితం నగరానికి వచ్చారు. మియాపూర్ మయూరి నగర్‌లో ఐదు అంతస్తుల భవన నిర్మాణం వద్ద పని దొరకడంతో సోమవారం మంచి రోజు ఉందని, పనులు ప్రారంభించేందుకు వచ్చారు. యాదగిరి మూడవ అంతస్తు లో క్రేన్ ఆపరేట్ చేస్తుండగా, విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. ఇటుకలపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన భార్య పరిగెత్తుకుంటూ వస్తున్న సమయంలో కిందపడిపోవడంతో స్వల్పంగా గాయపడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకునిదర్యాప్తు చేస్తున్నారు.

'గాంధీ'లో అదనంగా 28 సీసీ కెమెరాలు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 28 : గాంధీ దవాఖానలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టంగా రూపొందించామని సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం అదనంగా మరో 28 సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిలకలగూడ సీఐ అనుదీప్‌లు సీసీ కెమెరాలను పరిశీలించారు.



ధన్వంతరీ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, భక్తులు

వైభవంగా ధన్వంతరీ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ

బాలానగర్, అక్టోబర్ 28 : బాలానగర్ డివిజన్, సాయినగర్‌లోని సాయి నాగేంద్రాలయంలో శ్రీ ధన్వంతరీ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ సామూహిక కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం ఆలయ చైర్మన్ అంబటి సునీల్ కుమార్‌గుప్తా ఆధ్వర్యంలో ఫౌండర్ చైర్మన్ అంబటి ప్రసాద్‌రావు పర్యవేక్షణలో ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ట, ధన్వంతరీ హోమం, 11.35 గంటలకు గోపూజ, అనంతరం ధన్వంతరీ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహాత్సవం, సాయంత్రం 7 గంటలకు లక్ష్మీనారాయణ ఇష్టి , తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ అవుల రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్యులు, తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి యుగంధర్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప నుంచి సికింద్రాబాద్‌కు ఆర్‌టీసీ బస్సు ప్రారంభం

రాజీవ్ గృహకల్పలో ఆర్‌టీసీ బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న సురేశ్ రెడ్డి

జీడిమెట్ల, అక్టోబర్ 28 : ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సూరారం రాజీవ్ గృహకల్ప నుంచి సికింద్రాబాద్‌కు ఆర్‌టీసీ బస్సును ఏర్పాటు చేశారని మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేశ్ రెడ్డి అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని రా జీవ్ గృహకల్ప సూరారం కాలనీ వయా సాయిబాబా నగర్ మీదుగా బాలానగర్ సికింద్రాబాద్ వరకు ఏర్పాటు చేసిన నూతన బస్సు సర్వీసును సోమవారం ఆయన ప్రారంభించారు. బస్సు సౌకర్యం కల్పించినందుకు డిపో మేనేజర్ ఆంజనేయులు, సీఐ నీలమణి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజెబుల్డ్ సంఘం ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, సత్యం, ఆంజనేయులు, వెంకటరామయ్య, అంజయ్య, రాజీవ్ గృహకల్ప అధ్యక్షుడు శివగౌడ్, అశోక్, తారాసింగ్, మహిళా నాయకురాలు మంగ, సరిత, నాయకులు పాల్గొన్నారు.

జేఎన్‌ఏఎఫ్‌ఏయూకు స్థలం కేటాయింపుపై హర్షం

ఖైరతాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీలో స్థలం కేటాయించడం హర్షణీయమని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ ప్రిన్సిపాల్ ప్రొ.గంగాధర్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీ డియాతో మాట్లాడుతూ..జేఎన్‌ఏఎఫ్‌ఏకు స్థలాన్ని కేటాయించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో జేఎన్‌ఏఎఫ్‌ఏయూ డీఏపీ వినోద్, డైరెక్టర్ ఎస్. కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాసూమ్ అలీ, ప్రొ. ఎంఎల్ ఆనంద్ పాల్గొన్నారు.

తన పుట్టిన రోజు సందర్భంగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకు ముందు ఆయన కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, తదితరులను కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డికి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. *– దుండిగల్, అక్టోబర్ 28*

హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్‌తో కాంటినెంటల్ ఒప్పందం

హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్‌తో కాంటినెంటల్ దవాఖాన భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని కాంటినెంటల్ దవాఖానలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంటినెంటల్ సీఎండీ గురు ఎన్ రెడ్డి, హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ సీఈఓ దృవ్‌సూద్, హెడ్‌కోచ్ తంగ్‌బోమ్ సింగ్టో, జట్లు కెప్టెన్ అలెక్స్ సాజీలు వివరాలు వెల్లడించి జట్టు జెర్సీని ఆవిష్కరించారు. కాంటినెంటల్‌కు చెందిన పలువురు డాక్టర్లు, జట్టు క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. *– శేరిలింగంపల్లి, అక్టోబర్ 28*

డీసీ మల్లారెడ్డికి పార్కు ఏర్పాటు చేయాలని వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

ప్రజావాణిలో పలు సమస్యలపై ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్,అక్టోబర్ 28: కుత్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో పలు సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను డీసీలు నర్సింహా, మల్లారెడ్డిలు స్వీకరించారు. ఈ సందర్భంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో మూడు, కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఐదు సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఆయా విభాగాల అధికారులతో చర్చించి ప్రజల నుంచి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పార్కు ఏర్పాటు చేయండి

జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్టలో పార్కు ఏర్పాటు చేయాలని సీపీఐ నేతలు కోరారు. ఈ మేరకు ప్రజావాణిలో సోమవారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. పోలీస్‌స్టేషన్, హెచ్ఎంటీ ఖాళీస్థలం ప్రాంతాల్లో పరిశీలన చేపట్టాలని కోరారు. అలాగే ఆప్రాంతాలు కబ్జా కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉమామహేశ్, హరినాథ్, స్వామి, శేఖర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన నూతన కమిషనర్ సాబేర్‌అలీ

దుండిగల్, అక్టోబర్ 28: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా నియమితులైన ఎండీ సాబేర్‌అలీ సోమవారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డిని బాచుపల్లి హిల్‌కౌంటీలోని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మేయర్.. కమిషనర్‌ను సత్కరించారు. అంతకు ముందు ఆయన ప్రగతినగర్‌లోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ పవన్, శానిటేషన్ ఇన్‌చార్జి సుకృత, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన పీఏసీ చైర్మన్

మియాపూర్ , అక్టోబర్ 28 : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ సోమవారం సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం గాంధీ అధ్యక్షతన పీఏసీ రెండో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిధుల ఖర్చులకు సంబంధించి నివేదికల రూపకల్పనపై పలు సూచనలు చేశారు. అసెంబ్లీలో నివేదికలను సమర్పించాల్సి ఉన్నందున ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కోరారు. కాగా.. సీఎస్ శాంతకుమారి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు గాంధీకి పుష్ప గుచ్ఛం అందించి ఆహ్వానించారు.

పీజేఆర్‌నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

ఆల్విన్ కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్ కాలనీలో డ్రైనేజీ, విద్యుత్ సమస్యలపై స్థానిక కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని , మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. త్వరలో పీఏసీ చైర్మన్ గాంధీతో కలిసి కాలనీలో పర్యటిస్తామని, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని శాశ్వత పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవి, శ్రీనివాస్, షౌకత్, వాసు, మహేశ్, నాగయ్య, సౌందర్య, నాగేశ్వర్‌రావు, నగేశ్, మధు, కృష్ణ, గోపి, రాజు, బాలు, శ్రీను, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు. *– మియాపూర్ , అక్టోబర్ 28*

దేశసమగ్రతకు కృషి చేయాలి

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యాంజలి పాఠశాల విద్యార్థులు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 28 : దేశ శ్రేయస్సు, సమగ్రతకు మనందరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ డివిజినల్ సేల్స్ హెడ్ సతీశ్‌కిషన్ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లిలోని విద్యాంజలి పాఠశాలలో విద్యార్థులు విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అవినీతి రహిత మెరుగైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. అవినీతిపై పోరాటం చేసేందుకు ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాంజలి ప్రిన్సిపాల్ బాలత్రిపుర సుందరీ దేవి, ఇండియన్ ఆయిల్ సంస్థ మేనేజర్ విద్యాధర్, సేల్స్‌హెడ్ సితేజ్‌తో పాటు పలువురు విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు న్యాయం చేయాలని వినతి



ఏఎంఓహెచ్ శ్రీకాంత్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న సాయిబాబా , చిరువ్యాపారులు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 28: ఖాజగూడ రహదారిపై నిర్వహించే వారాంతపు సంత చిరువ్యాపారులకు న్యాయం చేయాలని కోరుతూ గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా సోమవారం శేరిలింగంపల్లి సర్కిల్ ఏఎంఓహెచ్ శ్రీకాంత్ రెడ్డిను కలిశారు. ప్రతి మంగళవారం ఖాజగూడ రహదారిపై సంత నిర్వహిస్తున్నామని, తమ జీవనాధారం చిరువ్యాపారమని వారు పేర్కొన్నారు. కొందరు గ్రామస్థులు సంత పెట్టనివ్వడం లేదని, ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

భారీ చోరీ..

మల్లంపేట్‌లో ఘటన

30తులాల బంగారం , అరకిలో వెండి ఆభరణాలతో పాటు రూ.30వేల నగదు అపహరణ

దుండిగల్, అక్టోబర్ 28: విహార యాత్రకు వెళ్లి వచ్చేసరికి ఇల్లుగులైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్‌లోని కేవీఆర్ కాలనీలో కృష్ణకిశోర్ అనే రియల్‌ఎస్టేట్ వ్యాపారి కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు.ఈ నెల 19న ఇంటికి తాళం వేసి భార్య, కూతురుతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. తిరిగి 27న రాత్రి ఇంటికి రాగా.. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి చూడగా బీరువాలో దాచిన 30తులాల బంగారం,అరకిలో వెండి వస్తువులతో పాటు రూ.30వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. అదే విధంగా పర్సులో దాచిన విలువైన కార్డులు సైతం దొంగలు ఎత్తుకెళ్లారు.దీంతో బాధితుడు సోమవారం దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగలకు తగిలి వ్యక్తి మృతి

అల్లాపూర్,అక్టోబర్28: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...జగద్గిరిగుట్టకు చెందిన రఘుపతిరావు(34) సెంట్రింగ్ మేస్త్రీ. సోమవారం అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లోని ఇంటి నిర్మాణం కోసం సెంట్రింగ్ పని చేసేందుకు ఉదయం 7.30గంటలకు వచ్చాడు.ఈ క్రమంలో టేప్‌తో కొలతలు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు టేప్ తగిలి.. షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా ఇంటి నిర్మాణ పనులు చేపడుతూ తన భర్త మృతికి కారణమైన ఇంటి యజమాని ఉదయ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు



సమావేశంలో పాల్గొన్న ఐసీఏఆర్ – ఐఐఓఆర్ న్యూఢిల్లీ డీడీజీ డా.శర్మ

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 28 : కుసుమ నూనె ఆరోగ్యానికి మేలు చేస్తుందని, కుసుమలో ముల్లులేని రకాలను కనుగొనేలా పరిశోధనలు జరుగాలని జాతీయ నూనెగింజల పరిశోధనా మండలి (ఐసీఏఆర్ – ఐఐఓఆర్ న్యూఢిల్లీ) డీడీజీ డా.శర్మ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వాటర్ టెక్నాలజీ సమావేశ మందిరంలో జాతీయ నూనెగింజల పరిశోధనలు, పీజేటీఎస్ఏయూ ప్రణాళిక రూపకల్పన రెండురోజుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇతర దేశాల నుంచి రూ.1.7 లక్షల కోట్లు వెచ్చించి నూనెలను దిగుమతి చేసుకుంటున్నామన్నారు. దీనిని తగ్గించడానికే భారత జాతీయ నూనెగింజల మిషన్‌ని ఏర్పాటు చేశారన్నారు. కుసుమలో లైనోలేనిక్ ఆసిడ్ ఉన్నందున కరోనా నాటి నుంచి డిమాండ్ పెరిగిందన్నారు. ఏడీజీ డా.సంజీవ్ మాట్లాడుతూ.. కుసుమ, అవిసెల సాగుకు అధిక రాష్ట్రాల వాతావరణం అనుకూలమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూనెగింజల సాగుకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. రైతు అవగాహన సదస్సులు, పరిశోధనలు పెరిగాయని మరింత పెరుగాల్సిన అవసరం ఉందన్నారు. రబీలో కుసుమ సాగు ఎక్కువగాఉంటుందని, వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులకు నూనెగింజల సాగు, చీడపీడలపై అవగాహన కల్పిస్తున్నామని పీజేటీఎస్ఏయూ అగ్రికల్చర్ డీన్ జెల్లా సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలోప్రధాన శాస్త్రవేత్త డా.సి.సుధాకర్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం వివిధ రాష్ట్రాల ఆదర్శరైతులు, శాస్త్రవేత్తలను సన్మానించారు.

హక్కులు కాపాడుకోవాలి : బాల్‌రాజ్

హిమాయత్‌నగర్ : కార్మికవర్గం ఐక్యతతో ముందుకుసాగి హక్కులను కాపాడుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ పిలుపు నిచ్చారు. సోమవారం ఎస్ఎన్ రెడ్డి భవన్‌లోవిలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా.. కార్మికుల జీవితాలకు భరోసాలేదన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి నా లుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తుందని విమర్శించారు. ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి

విద్యతో పాటు నైపుణ్యాలను పెంచుకుని స్వయం ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలని బాబు జగ్జీవన్‌రామ్ ప్ర భుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ సూచించారు. ' గ్రామీణ సమాజానికి స్వయంఉపాధి – సుస్థిర అ భివృద్ధి లో విద్యార్థుల పాత్ర' పై సోమవా రం నారాయణగూడలోని బీజేఆర్ కాలేజీలో సదస్సు జరిగింది. వక్తలు విద్యార్థులు త మ కెరీర్‌కు ఉపయోగపడే అంశాలపై అ వగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ నాగయ్య, వైస్ ప్రి న్సిపాల్ డాక్టర్ సత్యనారాయణరె డ్డి, అధ్యాపకులు డాక్టర్ కె.నాగయ్య, సీ హెచ్. ముత్తయ్య, అరుణ, డాక్టర్ నర్సిం లు, సూర్యకుమారి, డాక్టర్ మనోజ్‌కుమార్, డా. బాలస్వామి, స్వాతి పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తా

మణికొండ, అక్టోబర్ 28 : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. హాల్‌మార్క్ పిసినీయ, మై హోమ్ అవతార్ నివాసితులు సోమవారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆర్ఎంసీ ప్లాంట్ వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని తక్షణమే క్లోజ్ చేయించాలని కోరారు. రోడ్ల ని ర్మాణం, మై హోమ్ అవతార్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటుపై వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్ఎంసీ ప్లాంట్‌పై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, ఇప్పటికే అధికారులకు పలు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. టాఫిక్ సిగ్నల్‌పై అధికారులతో సంప్రదింపు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సీసీ రోడ్ల పనులు ప్రారంభం కానున్నాయని, ప్రజలంతా సహకరించాలని కోరారు. మల్లేశ్, రామకృష్ణారెడ్డి, శ్రావణ్ పాల్గొన్నారు.

వీసీతో సుదీర్ఘ చర్చ

వ్యవసాయ యూనివర్సిటీ : వ్యవసాయ యూనివర్సిటీ తెలంగాణ విద్యాకమిటీ చైర్మన్ ఆకునూరి మురళి సోమవారం రంగారెడ్డిజిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంను సందర్శించారు. వీసీ జానయ్యతో సుదీర్ఘంగా చర్చించారు. విశ్వవిద్యాలయంలోని పరిశోధన, విస్తరణ, విద్యతో పాటు , వి ద్యావిధానంపై చర్చించారు. విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాల్లో భాగంగా అవినీతి వ్యతిరేకతపై టీచింగ్ ,నాన్ టీచింగ్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి

మైలార్‌దేవ్‌పల్లి : విద్యార్థులు సన్మార్గం లో నడిచినపుడే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ పేర్కొన్నారు. మహావీర్ ఇన్‌స్టిట్యూ ట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్, ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. యాంటీ నా ర్కోటిక్స్ బ్యూరో డీసీపీ సుభిరామ్‌రెడ్డితో క లిసి ఏసీపీ బాలాజీ పాల్గొన్నారు. విద్యార్థుల కదలికపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృ ష్టి పెట్టాలని సూచించారు. వి ద్యార్థులతో డ్రగ్స్ వాడకుండా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

గాయకులను సత్కరించిన వకుళాభరణం కృష్ణమోహన్

ముషీరాబాద్, అక్టోబర్ 28: స్వర కళ్యాణి ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఇది నా ప్రియ నర్తన వేళ శీర్షిక చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురిని అలరించింది. స్వర కళ్యాణి స్వర భాస్కర్, రామలక్ష్మి, జయరాం, జ్యోతి, లత పాడిన వేటూరి పాటలు రంజింపచేశాయి. ఈ కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం, కృష్ణ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కిన్నెర రఘురాం, శశిబాల. రఘు, రాంబద్రీ నాథ్, శేఖర్, రామచంద్రారావు, రాధాకృష్ణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

తల్లిని తిట్టాడని.. విద్యార్థిపై దాడి

మాదాపూర్, అక్టోబర్ 28: తల్లిని తిట్టాడని నడుచుకుంటూ వెళ్తున్న ఓ విద్యార్థిపై దాడి చేశారు. ఆ సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ... మాదాపూర్‌లోని డాక్టర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఆదిత్యా శంకర్‌పల్లిలో లా రెండవ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజుల నుంచి అదే కళాశాలలో చదువుతున్న సుమంత్ గౌడ్‌తో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదిత్యా అనే విద్యార్థి సుమంత్ గౌడ్ తల్లిని బూతులు తిట్టి.. ఈ నెల 25న కళాశాల పూర్తకాగానే ఇంటికి వెళ్లడానికి బయటకు వచ్చాడు. మాదాపూర్‌లోని ఢీ మార్ట్ వద్ద బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా సుమంత్ గౌడ్ నలుగురు స్నేహితులతో కలిసి వచ్చి .. మా అమ్మను తిడతావా రా అంటూ ఆదిత్యాను కొట్టాడు. దీంతో ఆదిత్యా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మంగళవారం వారిద్దరిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడుతానని సీఐ తెలిపారు.

విధుల్లో పారదర్శకత పాటించాలి

అమీర్‌పేట్, అక్టోబర్ 28 : విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో సీనియర్ సోషల్ సైంటిస్ట్ డబ్ల్యు.జి.ప్రసన్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 'కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటిఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ' ప్రతిజ్ఞ జరిగింది. టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి సహ సీఈఈ రఘు, ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్న సమీక్ష సమావేశంలో ఉద్యోగులు ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సభ్య కార్యదర్శి రవి మాట్లాడుతూ పీసీబీ కార్యాలయాల్లో కాలుష్య నియంత్రణకు సంబంధించి బోర్డు రెగ్యులేటరీ విధుల నిర్వహణలో పారదర్శకత ఉండేలా ఉద్యోగులు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం నిబంధనల అమలు తీరును సమీక్షించారు. సమాచార హక్కు చట్టం నిబంధనలు, ఆర్టీ అధికారులకు సంబంధించిన తాజా సమాచారాన్ని సంస్థ పోర్టల్‌లో అందుబాటులో ఉండేలా తగిన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.